నేడు మాదాపూర్‌లో నీటి సరఫరాకు అంతరాయం

చందానగర్‌: హైదరాబాద్‌ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణ ఫేజ్‌ 3 రింగ్‌ మెయిన్‌-1 పరిధిలోని ప్రశాసన్‌నగర్‌ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్‌పైప్‌లైన్‌ లీకేజీలు ఏర్పడిందని, ఆయా పైప్‌లైన్‌కు మరమ్మతుల పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని దుర్గం చెరువు డివిజన్‌ 15 జనరల్‌ మేనేజర్‌ బ్రిజేష్‌ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ● మాదాపూర్‌ సెక్షన్‌ పరిధిలోని చంద్రా నాయక్‌ తండా, అయ్యప్ప సొసైటీ, సాయినగర్‌ ప్రాంతాలలో తాగునీటి సరఫరా ఉండదన్నారు. కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాలలో వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

'మనూ' పరిశోధక విద్యార్థి ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ


ఫజలుద్దీన్‌

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి సయ్యద్‌ ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. మేనేజ్‌మెంట్‌ అండ్‌ కామర్స్‌ విభాగంలో ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీని ప్రకటించారు. ఆయన మేనేజ్‌మెంట్‌ అండ్‌కామర్స్‌ విభాగం ప్రొఫెసర్‌ బదీయుద్దీన్‌ పర్యవేక్షణలో 'అమ్మకాలు, వ్యక్తిగత శిక్షణ, అభివృద్ధి పద్ధతులు: ఎంపిక చేసిన ఆటోమొబైల్‌ కంపెనీల అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను రూపొందించి సమర్పించారు. దీన్ని పరిశీలించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటిస్తున్నట్లు 'మనూ' పరీక్షల కంట్రోలర్‌ విభాగం వివరించింది.

ఉత్సాహంగా నల్లగండ్ల చెరువు 'క్లీనప్‌ డ్రైవ్‌'

ఉల్లాసంగా పాల్గొన్న ఎన్‌సీఆర్‌ వోయిక్స్‌ వలంటీర్లు


క్లీనప్‌ డ్రైవ్‌లో పాల్గొన్న ఎన్‌సీఆర్‌ వోయిక్స్‌ వలంటీర్లు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని చెరువును క్లీనప్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్‌సీఆర్‌వోయిక్స్‌ సీఆర్‌ఎస్‌ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని సంస్థ వలంటీర్లు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా 21.1 కిలోల గాజు సీసాలు, 1.5 కిలోల ప్లాస్టిక్‌ సీసాలు, వివిధ వ్యర్థాలు 113.7 కిలోలు, ఇలా మొత్తం 136.3 కిలోల వ్యర్థాలను తొలగించారు. చెరువు పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వలంటీర్లు పేర్కొన్నారు.

సరికొత్త హంగులతో పోలీస్‌స్టేషన్‌

జిన్నారం(పటాన్‌చెరు): సీఎస్‌ఆర్‌ నిధులతో అత్యాధునిక వసతులతో మోడల్‌ పోలీస్‌స్టేషన్‌ నిర్మించడం అభినందనీయమని మల్టీజోన్‌-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నూతన పోలీస్‌ స్టేషన్‌ భవన నిర్మాణానికి ఎంపీ రఘునందన్‌ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, హెటిరో పరిశ్రమ ప్లాంట్‌ డైరెక్టర్‌ మోహన్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే అత్యాధునిక పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెటిరో పరిశ్రమ సహకారంతో రూ. 3.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్‌ పంకజ్‌, డీఎస్పీ ప్రభాకర్‌, సీఐ రవీందర్‌రెడ్డి, నరేష్‌, లాలునాయక్‌, కమిషనర్‌ మధుసూదన్‌ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్‌ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఆనంద్‌, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాణించిన జిల్లా రెజ్లర్లు

మణికొండ: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌ పోటీలలో రంగారెడ్డి జిల్లా రెజ్లర్‌లు సత్తా చాటి అత్యధిక పతకాలను సాధించారు. హైదరాబాద్‌ నగరంలోని యాకుత్‌పురాలో ఆదివారం జరిగిన పోటీలలో జిల్లాకు చెందిన అండర్‌-15 బాలుర ఫ్రీ స్టైల్‌, గ్రీకో రోమన్‌స్టైల్‌, మహిళా రెజ్లింగ్‌ పోటీలలో క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో మూడు బంగారు, 6 వెండి, 6 కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా రెజ్లింగ్‌ అసోసియేషన్‌ కోశాధికారి, టీం కోచ్‌ కె.రాజ్‌కుమార్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పాండు, సీనియర్‌ రెజ్లర్‌ శ్రీధర్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనాదిగా రెజ్లింగ్‌ పోటీలలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక పతకాలను సాధించిన ఘనత జిల్లాకు ఉందన్నారు. భవిష్యత్‌లోనూ అదే ఒరవడి కొనసాగించాలని ఆకాంక్షించారు.




నల్లగండ్ల ఫ్లైఓవర్‌ గోడలకు మొలిచిన రావి, మర్రి చెట్ల మొక్కలు

ఫ్లైఓవర్‌ గోడలకు మర్రి, రావి మొక్కలు



నల్లగండ్ల ఫ్లైఓవర్‌ గోడలకు మర్రి, రావి మొక్కలు మొలుస్తున్నాయి. చెట్లలో భారీగా ఉండే వాటిలో రావి, మర్రి చెట్లను మనం పలు చోట్ల చూస్తుంటాం. అట్లాంటి చెట్ల మొక్కలు మొలవడం కలవరానికి గురి చేస్తోంది. ఈ మొక్కలు కాస్తా చెట్లుగా పెరిగి పెద్దవైతే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫ్లైఓవర్‌ గోడలపై మొక్కలు దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్‌ గోడలకు మూడు చోట్ల రావి చెట్ల మొక్కలు, ఒక చోట మర్రిచెట్టు మొక్క, మరోచోట రావి, మర్రి రెండు మొక్కలు కూడా పెరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. – శేరిలింగంపల్లి




విమాన ప్రమాద మృతులకు నివాళి


ఖాజాగూడలో ర్యాలీ చేస్తున్న స్థానికులు

రాయదుర్గం: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలో శనివారం రాత్రి కొమరగొని అఖిల్‌గౌడ్‌ నాయకత్వంలో యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు. పెద్ద బ్యానర్‌, కొవ్వొత్తులను పట్టుకొని ఖాజాగూడ కాటమయ్య గుడినుంచి సమాజ్‌ వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం విమాన ప్రమాదంలో మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల్‌గౌడ్‌ మాట్లాడుతూ విమానం ప్రమాదాలు భవిష్యత్తులో రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అమాయక ప్రజలను, విద్యార్థులను ఈ ప్రమాదం బలికొనడం పట్ల యావత్‌ ప్రపంచాన్ని కలిచి వేసిందన్నారు. యువ నాయకులు శివకంఠగౌడ్‌, అరుణ్‌గౌడ్‌, హరీష్‌, వీరేష్‌యాదవ్‌, స్వరూప, నితీష్‌గౌడ్‌, కిరణ్‌గౌడ్‌, శివ, రమేష్‌, అజ్జుగౌడ్‌, భరత్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.


ఖాజాగూడలో కొవ్వొత్తుల ఏర్పాటు చేస్తున్న మహిళలు

వ్యక్తి అదృశ్యం


నవీన్‌

మియాపూర్‌: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో చోటుచేసుకుంది. డీఐ రమేష్‌ నాయుడు సమాచారం మేరకు... మియాపూర్‌ హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో పి.నవీన్‌(28) అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన సుచిత్రలోని శ్రీ బాలాజీ వైన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 13న సాయంత్రం ఇంటి నుంచి వైన్స్‌ షాప్‌నకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. పని పూర్తి చేసుకుని తోటి ఉద్యోగి మహేష్‌తో కలిసి సుచిత్ర నుంచి ర్యాపిడో ఆటోలో వచ్చారు. రాత్రి 11 గంటలకు మియాపూర్‌ ఎక్స్‌ రోడ్డు వద్ద నవీన్‌ ఆటోలోంచి దిగగా మహేష్‌ హాఫీజ్‌పేటలోని తన ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి అయినా నవీన్‌ ఇంటికి వెళ్లకపోవడంతో భార్య లావణ్య నవీన్‌ మొబైల్‌కు ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. వెంటనే నవీన్‌ స్నేహితుడు మహేష్‌కు ఫోన్‌ చేసి తన భర్త గురించి ఆరా తీయగా నవీన్‌ మియాపూర్‌ ఎక్స్‌ రోడ్డులో దిగాడని తెలిపాడు. భార్య లావణ్య పరిసర ప్రాంతాల్లో వెతికి బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె ఆదివారం మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్‌ నారాయణ రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎన్‌జీవోస్‌ కాలనీ, కేంబ్రిడ్జ్‌ స్కూల్‌, అలయ్‌బలయ్‌ చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెక్రటేరియట్‌ కాలనీ, కాళోజీ చౌరస్తా, టీఎన్‌జీవోస్‌ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

సాయిరామ్‌నగర్‌కాలనీ ఫీడర్‌ పరిధిలో...

శేరిలింగంపల్లి: 11 కేవీ సాయిరామ్‌నగర్‌కాలనీ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్ణీత వేళల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయిరామ్‌ నగర్‌కాలనీలో విద్యుత్‌ ఉండదన్నారు. 11 కేవీ గుల్‌మోహర్‌పార్కు ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుల్‌మోహర్‌ పార్కు, ఎస్‌బీఐ కాలనీలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తాని వెల్లడించారు.

హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో...

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ హఫీజ్‌పేట్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయినగర్‌, యూత్‌ కాలనీ ఏరియాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

◆ మైత్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనప్రియనగర్‌, భానుటౌన్‌షిప్‌, డాల్ఫిన్‌ ఎస్టేట్స్‌, ఆల్విన్‌ ఎక్స్‌ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదని తెలిపారు.

తారానగర్‌ సెక్షన్‌ పరిధిలో...

హుడా కాలనీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుమన్‌ వెల్లడించారు.

◆ ఇంజనీర్స్‌ ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గంగారం, మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు, గంగారం మెయిన్‌ రోడ్డు, ఇంజనీర్స్‌ ఎన్‌క్లేవ్‌ ఏరియాలలో విద్యుత్‌ నిలిపివేస్తున్నామన్నారు.

◆ ఆర్టీసీ కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చందానగర్‌ హుడా కాలనీ, ఎంఎంటీఎస్‌ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

చందానగర్‌, హఫీజ్‌పేట్‌, పాపిరెడ్డికాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో...

చందానగర్‌: చందానగర్‌, హఫీజ్‌పేట్‌, పాపిరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని ఏఈ దీప్తి తెలిపారు.

◆ ఆర్టీసీ కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, మదీనాగూడ, ల్యాండ్‌ మార్క్‌ రెసిడెన్సీ, మదీనాగూడ ఏరియాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

◆ హఫీజ్‌పేట్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినాయక నగర్‌, ప్రకాష్‌నగర్‌ ప్రాంతాలలో విద్యుత్‌ నిలిపివేస్తామని తెలిపారు.

◆ మైత్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆల్విన్‌ క్రాస్‌రోడ్డు, మమత ఎస్టేట్స్‌, హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ మెయిన్‌ రోడ్డు ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

◆ మార్కెట్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీఎం తోట, శిల్పా గార్డెన్‌, వెంకటేశ్వర నగర్‌ కాలనీ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దీప్తి వివరించారు.

కార్మిక ధర్నాను జయప్రదం చేయాలి

మణికొండ: స్టేట్‌ లేబర్‌ కమిషనర్‌ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు ఎస్‌.మల్లేష్‌ పిలుపునిచ్చారు. గండిపేట మండలం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. బీటీసీ మండల కార్యదర్శి బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఏఐటీయూసీ అనేక పోరాటలతో 1996లో భవన నిర్మాణ కార్మికుల కోసం తీసుకొచ్చిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇన్సూరెన్స్‌ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్‌కు అప్పగిస్తే భవన నిర్మాణ కార్మికులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన స్టేట్‌ లేబర్‌ కమిషనర్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వేలాదిగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ సీనియర్‌ నాయకులు శంకరయ్య, మండల కార్యదర్శి స్వామి, శ్రీకాంత్‌, శ్రీనివాస్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల పక్షాన అవిశ్రాంత పోరు

సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య


సమావేశంలో పాల్గొన్న సీపీఎం నేతలు

గచ్చిబౌలి: ప్రజల పక్షాన.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటం చేయడమే సీపీఎం ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. శేరిలింగంపల్లి, గండిపేట మండలాల సీపీఎం ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతులు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరంతరం పేదల కష్టాలపై పోరాటం నిర్వహిస్తూ పాలకపక్ష ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహించే పార్టీగా సీపీఎం గుర్తింపు పొందిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేవలం ప్రజల మధ్య విభజన తీసుకొస్తూ తన పరిపాలన కొనసాగిస్తున్నదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలకు జీవన ప్రమాణాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా పోరాటం చేసిన నాయకులను దేశ ద్రోహులనే ముద్ర వేస్తూ అనేక నాయకులను జైలుకు పంపారని గుర్తు చేశారు. కార్మిక హక్కులను కాలరాసేలా లేబర్‌ కోడ్‌ బిల్లులను తీసుకొచ్చి కనీస వేతనాలు అమలు కార్మిక సంఘం పెట్టుకునే హక్కులను కాలరాస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్‌, జగదీష్‌, జిల్లా నాయకులు శోభన్‌, మాణిక్యం, ప్రవీణ్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న యువత

కాంటినెంటల్‌ ఆస్పత్రి ఛైర్మన్‌ డాక్టర్‌ గురు ఎన్‌ రెడ్డి

రాయదుర్గం: ఒక యూనిట్‌ రక్తం వాస్తవానికి ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని కాంటినెంటల్‌ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, ఛైర్మన్‌ డాక్టర్‌ గురు ఎన్‌ రెడ్డి స్పష్టం చేశారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతంలోని కాంటినెంటల్‌ ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్‌ హౌస్‌ బ్లడ్‌ డొనేషన్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించగా ఆదివారంతో 100 మంది ఔత్సాహికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ గురు ఎన్‌ రెడ్డి మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడడానికి రక్తదాతలు చేసిన రక్తం ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. అందుకే అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన సూచించారు. రక్తదాతలను పెంచడానికి భారీ అవగాహన ప్రచారాన్ని కూడా చేపట్టామన్నారు. అత్యవసర పరిస్థితులలో పాటు వివిధ వ్యాధుల చికిత్సలో రక్తం ఆవశ్యకతపై అవగాహన కల్పించిందన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలలో టీజీఐఐసీ జోనల్‌ మేనేజర్‌ అండ్‌ కమిషనర్‌ కవిత ముత్యాల ఉండడం విశేషం, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని పలువురు రక్తదానం చేయడానికి ముందుకువచ్చారు. అలాగే కాంటినెంటల్‌ ఆస్పత్రిలో వివిధ విభాగాలలో పనిచేసేవారు కూడా ముందుకొచ్చి రక్తదానం చేయడం విశేషం. కార్యక్రమంలో పలువురు ఆస్పత్రి వైద్యులు, వైద్య బృందం, అధికారులు, రక్తదాతలు పాల్గొన్నారు.

పాదచారుల వంతెనల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి


హఫీజ్‌పేట్‌లోని ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి లిఫ్టులను పరిశీలిస్తున్న నేతలు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని జాతీయ రహదారిపై జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నాలుగు ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలు నిర్మించారు. వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బోయిని మహేష్‌ యాదవ్‌ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్‌ నుంచి గంగారం వరకు ఉన్న ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాదచారుల కోసం ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలు నిర్మించారు కానీ వాటి నిర్వహణపై ఎవరు పట్టించుకోలేదన్నారు. వృద్ధులు, వికలాంగుల లిఫ్టు, ఎస్కలేటర్లు పనిచేయడం లేదన్నారు. ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలపై కొంత మంది మద్యం సేవిస్తున్నారని, అటువైపు వెళ్లాలంటే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నగరంలో 20కి పైగా ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలు ఉన్నప్పటికి ఏ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. నిర్మించి వదిలేశారు కానీ అటు వైపు చూసే వారు కరువయ్యారన్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు పవన్‌, నవీన్‌, రంజిత్‌, శ్రీనివాస్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం.. నయన మనోహరం


నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్‌: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య కళాకారిణి ఐశ్వర్య ఎం నాయర్‌ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈశానకౌతం, శంకరశ్రీగిరి, శివకామ సుందరి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. రుహాణి కూచిపూడి డాన్స్‌ అకాడమీ కల్పన శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా మహాగణపతి, కొలువైతివారంగసాయి, భాగ్యదా లక్ష్మీ, అచ్యుతం కేశవం, శివస్తుతి, జనుతశబ్దం, అలరులు కురియగా, భామాకలాపం, అంశాలను కళాకారులు హారిక, శారద, రాజేశ్వరీ, దీప్తి, శిరీష, మోక్ష, అద్యారావు, సితార, దేవిక, భవ్యశ్రీ, శ్రీతనివ్య, ఈషా, నేహా, అపూర్వ తదితరులు పాల్గొని ప్రదర్శించారు.



అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరనాత చర్చికు 80 గజాలు, నాయిబ్రహ్మణ సంఘానికి కొమరంబీమ్‌ కాలనీలో కేటాయించిన 150 గజాల స్థలాలకు సంబంధించిన పత్రాలను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలాలకు సంబంధించిన పత్రాలను ఇచ్చామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ వైస్‌ ఛైర్మన్‌ రాములు గౌడ్‌, మాజీ సర్పంచ్‌ సోమిరెడ్డి, తెల్లాపూర్‌ సొసైటీ ఛైర్మన్‌ బుచ్చిరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ప్రభు, మాజీ కౌన్సిలర్‌లు నాగరాజు, శ్రీశైలం, లచ్చిరాం, బాలాజీ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పోచారం గ్రామంలోని ఓ కాలనీలో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వర స్వామి దేవాలయం భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించిన క్లబ్‌ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీకి మిషన్‌ భగీరథ ద్వారా మంచినీరు అందించాలన్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు.. త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్షించి మంచి నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమీపంలోని డంపింగ్‌ యార్డ్‌ తరలించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు.